విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 29, డిసెంబరు 2025

సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం

మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించడం జరిగింది.

కార్యకర్తలే పార్టీకి అధినేతలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : తెలుగుదేశం పార్టీలో ప్రతి కార్యకర్త ఒక అధినేతతో సమానమని, వారి కృషితోనే పార్టీ పటిష్టంగా ఉందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పేర్కొన్నారు. ఆదివారం నంద్యాలలో నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీ ప్రాణమని సాధారణ కార్యకర్తను కూడా గౌరవించే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే వారిని గుర్తించి, గౌరవించుకోవడం మన బాధ్యతన్నారు. ఈ క్రమంలోనే పార్టీ కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్యకర్తలను మంత్రి ఫరూక్ ప్రత్యేకంగా అభినందించి, అవార్డులతో సత్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం గత 18 నెలల్లో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని కొనియాడారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకొని వెళ్లాలన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, ప్రభుత్వానికి-ప్రజలకు మధ్య వారధిలా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, వివిధ గ్రామల అధ్యక్షులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కోట్ల కుటుంబానికి చెడ్డ పేరు తెస్తే సహించం

విశాలాంధ్ర - డోన్ రూరల్: కోట్ల కుటుంబానికి చెడ్డపేరు తేవాలని చూస్తే సహించమని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టీడీపీ నేత కేశన్న గౌడ్ అన్నారు. స్థానిక నివాస గృహంలో విలేకరుల సమావేశంలో కేశన్న గౌడ్ మాట్లాడుతూ సాయిబాబా గుడి దగ్గర ఉన్న ప్రహరీ గోడ కూల్చివేత గురించి మాట్లాడుతూ టీడీపీ పార్టీకి గాని ఎమ్మెల్యే కోట్ల కుటుంబానికి కానీ ఎటువంటి సంబంధం లేదని అన్నారు. సర్వే నంబర్ 311 కు సంబంధించిన ఆరు ఎకరాలలే అవుట్‌కు రాస్తా ఇవ్వడానికి గాను సాయిబాబా గుడి కమిటీ సభ్యులు గుడి అభివృద్ధికి రూ.15లక్షలు ఒప్పందం ప్రకారం చెల్లింపుకు కమిటి సభ్యులు ఒప్పుకున్న తర్వాతనే 60 అడుగుల గోడను తొలగించి రాస్తా ఏర్పాటుకు వచ్చామని తెలిపారు. కొంత మంది పాత్రికేయులు తనను బహిష్కృత నాయకుడు అన్న విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రస్తుత మంత్రి లోకేష్ పాద యాత్రలో తమను టీడీపీ పార్టీలో చురుకుగా పాల్గొనాలన్న విషయం తెలుసుకోవాలన్నారు. కొందరు నన్ను వ్యక్తిగతంగా దెబ్బ తీయాలని చూస్తున్నారని వారి ఆటలు కొనసాగనివ్వమని కేశన్న గౌడ్ డోన్ లో ఎక్కడైనా సెంట్ స్థలం ఆక్రమించినట్లు నిరూపిస్తే రాజకీయాలనుండి తప్పుకుంటానని అన్నారు. సర్వే నంబర్ 273 కు సంబంధించిన పొలం మా పూర్వీకుల నుండి మాకు వచ్చిందని మహమ్మద్ షమీర్, మాహమ్మద్దు షఫీ, మాలిక్ పటేల్ అన్నారు. సాయిబాబా భక్తులమైన మేము గుడి అభివృద్ధి కొరకు కొంత మొత్తాన్ని ఇవ్వడానికి అంగీకరించామని తెలిపారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే కోట్ల కు ఎటువంటి సంబంధం లేదని అన్నారు. ఈ సమావేశంలో రాము గౌడ్, కిరణ్ యాదవ్, గోసానిపల్లి మాజీ సర్పంచ్ శ్రీరాములు, అశోక్, ఆటో భాష, ఇమామ్ భాష తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన స్థితిలో రోడ్లు

- అధ్వాన్నంగా అప్పనపల్లి, చిన్నకంబలూరు రస్తా
- ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని రహదారి
- కన్నెత్తి చూడని అధికారులు ,పాలకుల వైనం..
- అవస్థలు పడుతున్న రెండు గ్రామాల ప్రజలు

విశాలాంధ్ర - రుద్రవరం : అప్పుడెప్పుడో 40 సంవత్సరాల క్రితం వేసిన రహదారి. అప్పటినుండి అదే రహదారి వెంట రెండు గ్రామాల ప్రజలు గుంతల మయమైన రహదారిలో రైతులు పడుతూ లేస్తూ ఎన్నో అవస్థలు పడుతూ వ్యవసాయానికి, పొలం పనులకు వెళుతున్న దుస్థితి. నాటినుండి నేటి వరకు ఏ అధికారి ఆ రహదారి వైపు కన్నెత్తి చూడకపోవడంతో అప్పుడు వేసిన రహదారి నేడు గుంతల మయంగా మారి రోడ్డుకు ఇరువైపులా ముళ్ళపొదలు పెరిగి చిట్టడవిని తలపిస్తూ ఉండడంతో గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్న దుస్థితి అప్పనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని అప్పనపల్లి గ్రామం నుండి చిన్న కమ్మలూరు గ్రామానికి వెళ్లే దారి పూర్తి అధ్వానంగా తయారై వ్యవసాయ రైతులకు, కూలీలకు ,బాటసారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని గ్రామస్తులు తెలిపారు. వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలు పైన ప్రభుత్వ అధికారులు మా గ్రామం నుండి చిన్న కమ్మలూరు వెళ్లేందుకు దాదాపు 5 కిలోమీటర్ల దూరంతో కంకర వేసి రాస్తాను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అప్పటినుండి నేటి వరకు ప్రభుత్వాలు మారుతున్న , పాలకులు మారుతున్న, మా ఊరి నుండి చిన్న కమ్మలూరుకి వెళ్లే రహదారి మారడం లేదన్నారు. మా ఊరి నుండి చిన్న కమ్మలూరు కి వెళ్లేందుకు రహదారి మరమ్మతులకై పలుమార్లు ఏళ్ల తరబడి అటు పాలకులకు ఇటు అధికారులకు చెప్పిన ఇంతవరకు ఏ ఒక్కరు కన్నెత్తి చూడని పరిస్థితి వచ్చిందన్నారు. గ్రామస్తులంతా వారి అవసరాలను తీర్చుకునేందుకు వెళ్లి ఇబ్బందులు పడుతూ తిరిగి గ్రామాన్ని చేరుకోవాలన్నారు. అంతే కాకుండా మొన్న జరిగిన ఓటింగ్ రోజు ఓటు వేసేందుకు అక్కడికి వెళ్లాలంటే ఎన్నో అవస్థలు ఇబ్బందులు పడడం జరిగిందన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మా ఊరి నుండి చిన్నకమ్మలూరికి వెళ్లే రహదారిని మరమ్మతులు చేసి ప్రజల అవసరాలను వారి ఇబ్బందులను అవస్థలను తీర్చాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.

రజకులకు దోబీ ఘాట్లు ఏర్పాటు

విశాలాంధ్ర-అవుకు: అవుకు పట్టణంలోని రజకులకు ప్రత్యేక దోబీ ఘాట్లను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుగాలి వెంకట రమణ నాయక్ ఆధ్వర్యంలో అవుకు పట్టణ రజక సంఘం సోదరులు మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో ధోబిఘూట్ల సమస్యను రజక సోదరులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను సాను కూలంగా విన్న మంత్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే రజకుల కోసము ధోబిఘూట్లను ఏర్పాటు చేస్తామని అన్నారు. అవుకు పట్టణంలో 100 కుటుంబాల వరకు రజకులు ఉన్నారని ఇంతవ రకు గత ప్రభుత్వ నాయకులు రజకుల ఓట్లను మాత్రమే ఉపయోగించుకొని వారి అభివృద్ధిని గాలికి వదిలేసారని అన్నారు. దూబీఘూట్ల సమస్యకు తక్షణమే పరిష్కారం చూపిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి రజక సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాశం వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, తిరుపతయ్య, ఆంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలపై జరిగే దాడులకు నిరసనగా "మౌన దీక్ష"

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల ముస్లిం జెఏసీ, క్రిస్టియన్ జెఏసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్య వేదిక, అన్ని రాజకీయ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ చౌక్‌లో నిర్వహించిన 'మౌన ఆందోళన' విజయవంతమైంది. భారత్, బంగ్లాదేశ్‌లలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మైనారిటీలు ఎదుర్కొంటున్న హింసాత్మక ఘటనలు, వేధింపులు, మౌలిక మానవ హక్కుల ఉల్లంఘనలను నిరసిస్తూ ఈ ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో సమానత్వం ,వేగవంతమైన న్యాయప్రక్రియల అవసరాన్ని ఒప్పుకున్నారు. మైనారిటీల రక్షణ కోసం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకొని రావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల బంగ్లాదేశ్ లో హిందూ యువకుడు దీపు చంద్రదాస్ పై జరిగిన దుర్మార్గాన్ని ఖండించారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో సామరస్యం, న్యాయం కోసం ప్రజలను చైతన్యపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఆందోళనలో నంద్యాల ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షులు ఎస్.ఎండి.అబులైస్, కన్వీనర్ మౌలాన అబ్దుల్లా, జమాత్ ఇస్లాం హింద్ అబ్దుల్ సమద్, ట్రెజరర్ ఆడిటర్ బాష, క్రిస్టియన్ జేఏసీ పాస్టర్ జానయ్య మన్నెం, దైవ సహాయం, సిపిఎం అధ్యక్షులు రమేష్, పుల్ల నరసింహ, లక్ష్మణ్, సిపిఐ బాబఫక్రుద్దీన్, మురళీధర్, ఎస్ డి పి ఐ ఏజాజ్ హుస్సేన్, మజీద్ ఖాన్, కాంగ్రెస్ చింతల మోహన్ రావు, మస్తాన్, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా అన్సర్ బాష, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు కడియం సాంబశివుడు, లక్క భూషణం, బీసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ నాయుడు, రెడ్డిపల్లె ఓబయ్య బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, దేవ భక్తుడు దళిత సంఘం,వెజిటబుల్ మార్కెట్ అర్షద్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ అభివృద్ధికి విరాళం

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలో నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు కడప జిల్లా గుర్రం గంగయ్య కుమారుడు గుర్రం కమలాకర్ సతీమణి రమాదేవి వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు రూ.50వేలు చందాను ఆలయ కమిటీ చైర్మన్ పి.వి.నాగార్జున రెడ్డి, డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి సమక్షంలో ఆదివారం ఆలయ అర్చకులకు అందజేశారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని ఇటిక్యాల గ్రామం నందు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను గ్రామ టీడీపీ నాయకులు శివారెడ్డి అందజేశారు. గ్రామానికి చెందిన ఎస్ శంకర్ రెడ్డి,ఇ. బాల వెంకట్ లబ్ధిదారులకు రూ.20,500 విలువచేసే చెక్కులను ఆదివారం అందించారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించినట్లు శివారెడ్డి తెలిపారు. అనారోగ్య సమస్యలతో పేదలు వైద్య ఖర్చులు పెట్టి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని, కుటుంబ ప్రభుత్వం వారికి అండగా ఉంటూ భరోసా కల్పిస్తున్నదని తెలిపారు. లబ్ధిదారులు నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తుల నడక మార్గం పర్యవేక్షణ

ప్రమాదాల పట్ల చెంచు గిరిజనులకు అవగాహన

ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అప్పావ్

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : మహాశివరాత్రి ,ఉగాది పండుగలు త్వరలో రానున్న సందర్భంగా ఆత్మకూరు ఎన్ఎస్టిఆర్ డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అప్పావ్, బైర్లూటి రేంజర్ కృష్ణప్రసాద్, నాగులూటి రేంజర్ ప్రణతి భాయ్ తో కలసి శ్రీశైలం పాదయాత్రకు వెళ్లే భక్తుల నడక మార్గాన్ని వెంకటాపురం గ్రామం నుండి పెచ్చెరువు గూడెం వరకు ఆదివారం నాడు పర్యవేక్షించారు. అంతేకాకుండా పెచ్చెరువు చెంచు గిరిజనులతో సమావేశం నిర్వహించి అడవిలో జరిగే అగ్ని ప్రమాదాల పట్ల గిరిజనులు జాగ్రత్త వహించాలని, అడవులలో మంటలు చెలరేగితే వన్యప్రాణులకు అడవి సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, మన అడవి పరిసర ప్రాంతాలలో మంటలు లేదా పొగ కనిపించిన వెంటనే అడవి శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని, అగ్ని ప్రమాదల నివారణకు గిరిజనులు సహకరించాలని అధికారులు కోరారు. అదేవిధంగా పెచ్చెరువు గూడెంలో ఉండే సెంచు గిరిజనుల యువతతో కలిసి ఫారెస్ట్ సిబ్బంది సరదాగా వాలీబాల్ క్రీడలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీ షీటర్‌లకు సిఐ హనుమంతు నాయక్ ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహి ంచారు. నేర ప్రవృత్తిని విడనాడి సత్ ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పోలీస్ శాఖ గట్టి చర్యలు చేపట్టిందని సిఐ అన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు

విశాలాంధ్ర -పాణ్యం : మద్యం సేవించి మైనర్లు వాహనం నడపరాదని ఏఎస్ఐ ఫజుల్లా తెలిపారు. ఆదివారం సాయంకాలం వాహన తనిఖీ భాగంగా నేషనల్ హైవేపై వాహనాలు తనఖీ నిర్వహించి లైసెన్స్ లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని సీయోను తెలుగు బాప్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ఆదివారం రెవ. విక్టర్ పాల్ పాస్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ఆడి, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. అనంతరం కొద్దిసేపు క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడి వారిని ఉత్తేజపరిచారు. కౌన్సిలర్ చిన్న రాజు, ప్రెసిడెంట్ సంజన్న, వైస్ ప్రెసిడెంట్ సంజన్న, సెక్రెటరీ రాజ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ ప్రసాద్, ట్రెజరరీ శేఖర్, సంఘ పెద్దలు దేవదాసు, అమ్రోజ్, బీసన్న, సుభా కర్, నాగశేషులు, నాగరాజు, చంద్రుడు, వెంకటేశ్వర్లు,నాగ శేషులు,శేషన్న,నాగ శేషులు, పాల్గొన్నారు.

లారీ నాపరాల ట్రాక్టర్ ఢీ

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో సమీపంలో రెండు రోడ్డు ప్రమాదాలు ఘటనలు ఆదివారం చోటుచేసుకున్నాయి. వివరాల మేరకు గ్రామ సమీపంలోని సాయి బాబా గుడికి ఎదురుగా ప్రధాన రహదారిపై రాఘవ రాజు పల్లి గ్రామం నాగరాజుకు చెందిన ట్రాక్టర్ నాపరాలలోడుతో తాడపత్రికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ ప్రమాద ఘటనలో ట్రాక్టర్ ఇంజన్ భాగం నుజ్జుగాక లారీ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. అదే గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా రాఘవ రాజు పల్లి యజమాని చెందిన నాపరాల లోడు ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడ్డది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ కిందికి దూకి ప్రమాదం నుండి బయటపడ్డాడు.

13 మంది పేకాటరాయుళ్లు అరెస్ట్

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లి,ఇటిక్యాల గ్రామాల పరిధిలో వేరువేరు చోట్ల పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్ట్ చేసినట్లు సిఐ రమేష్ బాబు ఆదివారం తెలిపారు. సిఐ వివరాల మేరకు అంకిరెడ్డిపల్లి గ్రామములోని వెటర్నరీ హాస్పిటల్ దగ్గర పేకాట ఆడుతున్న ఆరు మందిని అరెస్ట్ చేసి వారి నుండి రు 1100 స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఇటిక్యాల గ్రామంలోని పెద్దమ్మ గుడి ఎదురుగా పాలిష్ ఫ్యాక్టరీలో పేకాట ఆడుతున్న ఏడు మందిని అరెస్ట్ చేసి వారి నుండి రు1500 లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమస్యలపై పోరాటం : సీపీఐ

విశాలాంధ్ర-డోన్ : పట్టణ సమస్యలపై పోరాటం చేస్తామని సీపీఐ నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలో కొండపేట సీపీఐ శాఖ సమావేశానికి ముఖ్య అతిథిగా కన్వినింగ్ కమిటీ కన్వీనర్ రాముడు, శాఖ కార్యదర్శి రామ్మోహన్, సహాయ కార్యదర్శి జులేఖ, రాఘవేంద్రలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో సమస్యలు ఎక్కడివిక్కడే ఉన్నాయన్నారు. కొండపేట సమస్యల సంబంధించి వాటి పరిష్కారానికి భవిష్యత్తు కార్య చరణాలురూపొందిస్తామని వెల్లడించారు.

కొత్తూరులో సీఐ దంపతుల పూజలు

విశాలాంధ్ర - పాణ్యం : మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలిసిన సుబ్రహ్మణ్యస్వామికి కర్నూలు మహిళ పోలీస్ స్టేషన్ సిఐ దంపతులు విజయ లక్ష్మి,నరేంద్ర కుమార్ రెడ్డి, అర్చకుడు సురేష్ శర్మ పూజ నిర్వహించి తీర్థ ప్రసాదం చేసినట్లు ఆలయ అధికారి రామకృష్ణ తెలిపారు. అనంతరం వారిని ఆలయ మర్యాదలతో సత్కరించారు.

మహిమాన్వితుడు వెంకటేశ్వరుడు

ఏడాదంతా ఉత్తర ద్వార దర్శనం

30న వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

విశాలాంధ్ర - చాగలమర్రి : పుణ్యక్షేత్రాల్లో భక్తులకు వైకుంఠ ఏకాదశి రోజున మాత్రమే ఉత్తర ద్వారంలో స్వామిని చూసే అవకాశం ఉంది. అయితే నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం మద్దూరు గ్రామంలో వెలసిన లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామిని సంవత్సరమంతా ఉత్తర ద్వారం ఉత్తర ముఖం దర్శించుకోవచ్చు. అదే ఈ ఆలయ ప్రత్యేకత.వెంకటేశ్వర స్వామీ ఉత్తరద్వారం ఉత్తర ముఖం కల్గిన ఏకైక ఆలయంగా పూర్వీకులు చెబుకొంటున్నారు.

ఆలయ చరిత్ర : మద్దూరు గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాత్రం ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకోవచ్చు 500సంవత్సరాల క్రితం శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఉత్తర ముఖద్వారంతో లక్ష్మీప్రసన్న వెంకటేశ్వర ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. శ్రీకృష్ణ దేవరాయలు, నల్లమల అడవి గుండా శ్రీశైలం నుంచి అహోబిలం వచ్చి అక్కడి నుంచి వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు వెళ్తూ మార్గం మధ్యంలోని మద్దూరు గ్రామంలో బస చేసినట్లు సమాచారం. రాయలవారు నిత్యం నిద్రలేచిన వెంటనే వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారని సమాచారం. అయితే అడవిలో ఆలయం లేకపోవడంతో స్వామివారిని దర్శనం చేసుకోవడం ఎలా అని ఆలోచించి తెల్లవారేలోగా ఆయన బస చేసిన ఇంటికి ఎదురుగానే ఉత్తరముఖంగా ఆలయాన్ని నిర్మించినట్లు స్థానికంగా ఉన్న చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఈనెల డిసెంబరు 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో సాయి చంద్రారెడ్డి, ప్రధాన అర్చకులు మామిడి కిషోర్ శర్మ, సాయిశర్మ తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజు భక్తుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి పల్లకీతో గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: ఈనెల 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జీపు జాత నిర్వహించారు. ఈ జాత జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో తిరుగుతూ కోవెలకుంట్ల పట్టణానికి చేరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కోవెలకుంట్ల గ్రామపంచాయతీ సర్కిల్ నందు నిర్వహించిన సభలో జిల్లా ఉపాధ్యక్షులు ఎండి గౌస్, జిల్లా నాయకులు ఎం.సుధాకర్ మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ నుండి జనవరి 4వరకు సిఐటియు అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని కార్మికులను చైతన్య పరుస్తూ ఈ జాత నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వెంకట లింగం, సుబ్బారావు, జైలన్,వెంకట్రావు, బుజ్జి ,కిరణ్, రఘు, మురళి, వెంకటలక్ష్మి, నస్రిన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి అధినేతలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - వెలుగోడు: కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి ఊపిరి, వారే నిజమైన అధినేతలు అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. ఆదివారం వెలుగోడు మండలం వేల్పనూరులోని తన స్వగృహం నందు నియోజకవర్గంలోని ఉత్తమ కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు సారధ్యంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం గత 18 నెలల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించి, ప్రజల్లోకి మరింతగా ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించి, పార్టీ కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని ఉత్తమ కార్యకర్తలుగా అభినందించి, అవార్డులతో ఎమ్మెల్యే సత్కరించారు. అభివృద్ధిని విస్మరించి, శవరాజకీయలు చేయడం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్యన్నారు. వైయస్ జగన్ ఏనాడూ సొంత కార్యకర్తలను పట్టించుకోలేదన్నారు. కార్యకర్తే అధినేత అని ప్రకటించిన పార్టీ తెలుగు దేశం మాత్రమేనని కుండ బద్దలు కొట్టారు. వైసీపీ ఫేక్ ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగోడు, ఆత్మకూరు, బండి ఆత్మకూరు మండలం అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి కొండంత అండ : మంత్రి బీసీ

విశాలాంధ్ర- బనగానపల్లె: నిరుపేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం కొండంత అండ ముఖ్యమంత్రి సహాయ నిధి అని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ ఎఫ్ కింద 91 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.41 లక్షల విలువైన చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాదిన్నర కాలంలో బనగానపల్లె నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 484 మంది లబ్ధిదారులకు రూ.3.78 కోట్లు అందజేశాం అని అన్నారు. చెక్కుల పంపిణీ అనంతరం వైద్య సహాయం పొందిన రోగుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

సూపర్ సిక్స్-సూపర్ హిట్ క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి

విశాలాంధ్ర-అవుకు: అవుకు మండల క్లస్టర్ ఇంచార్జ్ అరుణ్ కుమార్ నాయక్ ప్రత్యేకంగా రూపొందించిన సూపర్ సిక్స్-సూపర్ హిట్ క్యాలెండర్-2026ను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అరుణకుమార్ నాయక్ క్యాలెండర్‌ను రూపొందించడం చాలా బాగుందని అన్నారు. ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయక్, పాశం వెంకటేశ్వర్లు, హరి, కిట్టు, గుల్లి,ఎల్లయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, సోమవారం 29, డిసెంబరు 2025

జిల్లా ఏర్పాటుతో పశ్చిమ ప్రాంత అభివృద్ధి

విశాలాంధ్ర -ఆలూరు : ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు 17 వ రోజున సిపిఐ పార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఆదివారం నిర్వహించిన ఈ దీక్షల్లో సీపీఐ నేతలు స్వయంగా పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్, సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ ఆదోని జిల్లా ఏర్పడితే పశ్చిమ ప్రాంత అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతం పరిపాలనా పరంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని నియోజకవర్గంలో అధికంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, బడుగు-బలహీన వర్గాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారని, జిల్లా ఏర్పాటుతో వారికి ప్రభుత్వ సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాగే వేదవతి, నగర డోన రిజర్వాయర్ల వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కావడానికి జిల్లా ఏర్పాటు ఎంతో తోడ్పడుతుందన్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రం 100 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉండటంతో ప్రజలు అధికారుల పనుల కోసం మూడు గంటలకు పైగా ప్రయాణం చేయాల్సి వస్తోందని విమర్శించారు. అక్కడికి వెళ్లినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారో లేదో కూడా తెలియని పరిస్థితి ఉందని, పనులు పూర్తి కాక మళ్లీ మరో రోజు వెళ్లాల్సి రావడం పేద ప్రజలకు తీవ్ర భారంగా మారిందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఈ ప్రాంత ప్రజలు రోజులు బడి జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగడం సాధ్యం కాదని, ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం లేదని సీపీఐ నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం రైతు సంఘం నాయకులు చంద్రకాంత్ రెడ్డి, చాపల గోపాల్, సిపిఐ సిద్దేశ్వర కాలనీ శాఖ కార్యదర్శి సిద్ధిలింగం, సీనియర్ నాయకులు ఎర్రస్వామి, పూల రామాంజనేయులు, పులి, రాముడు, రవికుమార్, కాంతారావు, పెద్ద ఈరప్ప, నాగరాజు పాల్గొన్నారు.

తొలి బిల్లే.. చివరి బిల్లా

- ప్రభుత్వాలు ఎన్ని మారినా.. పేద మహిళ గృహ స్వప్నం నెరవేరడం లేదు
- ఇల్లు మంజూరై ఎనిమిదేళ్లు
- బిల్లు రాకపోతే ఇల్లు అమ్ముకోవాల్సిందే

విశాలాంధ్ర -ఆలూరు: మండల కేంద్రంలోని సిద్దేశ్వర కాలనీకి చెందిన బండారు లింగమ్మ అనే పేద మహిళ గృహ నిర్మాణానికి మంజూరైన ఇంటి బిల్లులు నిలిచిపోవడంతో తీవ్ర మనోవేదన వ్యక్తం చేస్తోంది. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో తనకు గృహం మంజూరైంది. ఆ సమయంలో తొలి విడతగా రూ.17 వేల పైచిలుకు తన ఖాతాలో జమ అయ్యాయని బండారి లింగమ్మ చెబుతోంది. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు ఒక్క రూపాయి సైతం జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంటి మంజూరు ఆశతో, ప్రభుత్వంపై నమ్మకంతో దాదాపు రూ.2 లక్షల వరకు అప్పులు చేసి ఇంటి నిర్మాణాన్ని కొనసాగించానని, ప్రస్తుతం ఇల్లు టాప్ లెవెల్ వరకు పూర్తయిందని తెలిపింది. కానీ బిల్లులు రాకపోవడంతో అప్పుల వడ్డీలు కట్టలేక ఇల్లు అమ్ముకునే పరిస్థితి వచ్చిందని కన్నీళ్లతో వాపోయింది. వైసీపీ ప్రభుత్వ కాలంలో అధికారులను ఆశ్రయించగా, ఇది మా ప్రభుత్వంలో మంజూరు కాలేదు కాబట్టి ఇప్పుడు బిల్లులు వచ్చే అవకాశమే లేదు, అని అధికారులు స్పష్టంగా చెప్పారని లింగమ్మ తెలిపింది. ఇటీవల మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, మరోసారి సంబంధిత అధికారులను సంప్రదించగా, సమాధానం చెప్పకుండా ముఖం చాటేస్తున్నారని ఆమె ఆరోపించింది. ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ మా బతుకులు మాత్రం మారడం లేదు. ఇప్పటికైనా నా ఇల్లు పూర్తవుతుందా? నా ఖాతాలో మిగిలిన బిల్లులు వేస్తారా, లేదా అని లింగమ్మ ఆశతో ఎదురుచూస్తోంది. పేదలకు ఇల్లు అన్న నినాదాలు వినిపిస్తున్న వేళ, ఇల్లు మంజూరై ఎనిమిదేళ్లు గడిచినా పూర్తి బిల్లులు రాని ఈ ఘటనపై సంబంధిత శాఖాధికారులు స్పందించాలని, బాధితురాలికి న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బిల్లు రాకపోతే ఇల్లు అమ్ముకోవాల్సిందే - బండారి లింగమ్మ : ఆలూరు మండల కేంద్రంలోని సిద్దేశ్వర కాలనీకి చెందిన బండారి లింగమ్మ, ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణ బిల్లులు ఇప్పటికీ విడుదల కాకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా బిల్లు రాకపోతే తాను ఎంతో ఆశతో నిర్మించుకున్న ఈ ఇల్లు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోయింది. ఇల్లు నిర్మాణం కోసం తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక పోతున్నానని, రోజు రోజుకీ అప్పుల భారం పెరుగుతోందని ఆమె కన్నీటితో తన బాధను వెల్లడించింది. ప్రభుత్వం మారినా తన గృహ స్వప్నం మాత్రం నెరవేరడం లేదని, అధికారులు స్పందించి వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని లింగమ్మ కోరింది.

ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలో బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యంలో శాంతిరాం ఐ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఆదివారం స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేంద్రియాలలో కన్నే అత్యంత ప్రధానమైనదని, కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమవుతుందన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయుక్తమని తెలిపారు. శాంతిరాం ఐ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్లు వెంకట్రాముడు, అబ్దుల్లా, షాషావలి వైద్య సేవలు అందించగా, శిబిరానికి సుమారు వందమందికి పైగా ప్రజలు హాజరయ్యారు. ఈరోజు ఆపరేషన్‌కు ఎంపికైన వారిని అదే రోజున బస్సులో కర్నూలుకు తీసుకెళ్లి శస్త్రచికిత్స చేయించి తిరిగి గ్రామానికి చేర్చే ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు వివరించారు. బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి కార్యదర్శి విరుపాక్షి అధ్యక్షత వహించారు. గ్రామ సర్పంచ్ వీరభద్ర, ఉప సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ లక్ష్మన్న, గ్రామ పెద్దలు వీరేష్, నర సింహులు, సేవా సమితి సభ్యులు రమేష్, వీరేష్, శేఖర్, సురేష్, అనిల్, సూరి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - చిప్పగిరి: రైతుల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోందని బెల్డోన సహకార పరపతి సంఘం అధ్యక్షులు కొండా రామాంజనేయులు తెలిపారు. ఆదివారం పాత్రికేయుల సమావేశంలో బెల్డోన సొసైటీ చైర్మన్ కొండా రామాంజనేయులు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే లక్ష్యంగా బెల్డోన సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు దీర్ఘకాలిక రుణాల కింద రూ.1 కోటి మంజూరు కాగా, మండల కేంద్రమైన చిప్పగిరి, దౌల్తాపురం, నంచర్ల, కుందన గుర్తి, గుమ్మనూరు గ్రామాల రైతులకు రుణాలు అందజేయడం జరిగిందన్నారు. ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జీ వైకుంఠం జ్యోతి సహకారంతో మండల రైతులను దృష్టిలో ఉంచుకొని మరో రూ.3 కోట్లు దాకా దీర్ఘకాలిక రుణాలు కింద ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. సొసైటీ ద్వారా రైతులు తీసుకున్న వివిధ రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధి కొరకు ప్రతి ఒక్క రైతు కృషి చేయాలన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినప్పుడే మరి కొంత మంది రైతులకు రుణాలు అందుతాయన్నారు.

పేదలకు అండ ఎర్ర జెండా

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: నగర సమితి పరిధిలోని కొత్త భూ పోరాట స్థలానికి ఆదివారం చంద్ర రాజేశ్వరరావు కాలనీగా పేరును పెట్టడం జరిగింది. అది ఆదివారం సీపీఐ సీనియర్ నాయకులు కె.జగన్నాథం పేరును పెట్టి నేమ్ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శి సి.మహేష్, నాగరాజులు పాల్గొన్నారు. అనంతరం సీపీఐ 101వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని చంద్ర రాజేశ్వరరావు కాలనీలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షత వహించారు. సీపీఐ సీనియర్ నాయకులు కె.జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ దేశంలో పేద బడుగు బలహీన వర్గాలకు అన్ని రకాల సకల సౌకర్యాలు అందే వరకు ఎర్రజెండా రాష్ట్రంలో ఉన్న పేదల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్లకు ఊడిగం చేసే దాంట్లో భాగంగా ఈ దేశాన్ని ఆదాయాన్ని అంబానీలకు తాకట్టు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు అన్వర్, ఈశ్వర్, నల్లన్న, విద్యార్థి సంఘం నాయకులు సోమన్న, అశోక్, కాలనీ ఇంచార్జీ ప్రసాద్, అశోక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగర బలిజ సంఘం కోశాధికారి ఎన్నిక

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: కర్నూలు నగర బలిజ సంఘం ఆదివారం హెచ్‌డీ సిటీ కాంప్లెక్స్ కార్యాలయంలో నగర బలిజ సంఘం కార్యవర్గ సమావేశం నగర అధ్యక్షులు గాండ్ల లక్ష్మన్న జరిగింది. ఈ సమావేశంలో నగర బలిజ సంఘం కార్యవర్గంలో మార్పులు, చేర్పులు గురించి నగర బలిజ సంఘం ప్రధాన కార్యదర్శి మండలం రవికుమార్ చర్చించారు. ఇందులో భాగంగా నూతన కోశాధికారిగా రిటైర్డ్ ఎస్సై ప్రకాష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు నాడు అధ్యక్షులు అర్జా రామకృష్ణ, కార్పొరేటర్ సోమిరెడ్డి, అడ్వకేట్ శ్రీనివాస్, పోతా సహదేవుడు, రామిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శివరాముడు, అనిమిరెడ్డి, వీరేశ్ బాబు, మధు, సుజాత, బ్రాహ్మణి, సరస్వతి పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ఒకేషనల్ కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: అప్రెంషిప్ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్న వోకేషనల్ కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్ బాషా డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదోని పట్టణంలో ఉన్నటువంటి ప్రైవేట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలల యజమాన్యం అప్రెంషిప్ పేరుతో విద్యార్థుల నుండి రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారన్నరని ఆరోపణలు చేశారు. ప్రభుత్వం నుంచి అప్రెంషిప్‌కు ఎలాంటి రుసుములు వసూలు చేయకూడదని నియమ నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కుతూ వోకేషనల్ చదువుతున్న విద్యార్థుల దగ్గర నుండి వేల రూపాయలు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. చాలామంది పేద విద్యార్థులు తాము కట్టలేము సార్ అంటే మీరు అప్రెంషిప్ ఫీజు కట్టితేనే మీకు పరీక్షలు రాయడానికి అనుమతి ఇస్తాము, లేకపోతే మీకు హాల్ టికెట్ ఇవ్వము అని విద్యార్థులకు భయభ్రాంతాల గురి చేస్తున్నారన్నారు ప్రభుత్వ నియా నిబంధనలు ఉల్లంఘించి విద్యార్థుల నుండి అప్రెంటిషిప్ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్న ప్రవేట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలల యజమాన్యంపై చర్యలు తీసుకొని విద్యార్థుల నుండి వసూలు చేసిన వేల రూపాయలు తిరిగి విద్యార్థులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి యు.దస్తగిరి, పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్, సహాయ కార్యదర్శి మోహన్, ఉపాధ్యక్షుడు వీరేష్, అంజి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం మా వైపు ఉంది, దౌర్జన్యం చేసే స్థితిలో లేము

విశాలాంధ్ర - నందవరం : న్యాయం తమ వైపు ఉందని, దౌర్జన్యం చేసే సంస్కృతి తమ దగ్గర లేదని జంబూ పెద్ద మల్లన్న గౌడ్, జంబూ చిన్న మల్లన్న గౌడ్‌లు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఎమ్మిగనూరు డీఎస్పీకి కారుమంచి బసవరాజు స్థలం తమది అంటూ ఫిర్యాదు చేయడంతో కొన్ని దినపత్రికల్లో వార్త రావడం జరిగిందన్నారు. ఆ స్థలం 1952లో జంబు బసవన్న గౌడ్ నుండి తమ తాతగారు కొనడం జరిగిందని, తమ ఇంటి ముందు వాహనాలను ఆపుకోవడానికి వదిలిన స్థలాన్ని తమది అని అంటున్నాడని, వాస్తవంగా నీటి బోరు, తాగునీటి కుళాయి, 4ఏళ్ల క్రింతం వేసినా టెంకాయ చెట్టు ఉన్నాయన్నారు. బసవ రాజుది స్థలమైతే ఇవన్నీ ఏర్పాటు చేసుకున్నప్పుడు ఎక్కడ ఉన్నాడని, దానికి సంబంధించి ఒక వైపు కాంపౌండ్ కూడా కట్టడం జరిగిందన్నారు. ఊర్లోనే ఉండి వేరేచోటి ఇల్లు కట్టించుకున్న వ్యక్తి, ఇప్పుడు స్థలం తనది అని చెప్పడం చాలా విడ్డురంగా ఉందన్నారు. నందవరం గ్రామంలో జంబు ఫ్యామిలీ ఎక్కడ దౌర్జన్యాలు చేసినట్లు దాఖలాలు లేవని, బసవ రాజే దౌర్జన్యంగా మా ఇంటి ముందు అడ్డంగా బండలు పాతెందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని నగరూరు గ్రామ బస్టాండ్ సమీపంలోని కల్వర్టు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నాగేశ్వరరావు, కూలీలు లక్ష్మీనరసింహ, మద్దిలేటిలు నాపరాల లోడుతో ట్రాక్టర్‌లో ఆదోనికి వెళ్తున్నారు. అదే సమయంలో మంత్రాలయానికి వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు నగరూరు బస్టాండ్ సమీపంలో ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న మద్దిలేటి (32) అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ నాగేశ్వరరావుకు తీవ్ర రక్తస్రావ గాయాలు కావడంతో 108 అంబులెన్స్ ద్వారా ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉపాధ్యాయులను భయపెట్టి పని చేయించ లేరు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: బాధ్యతతో పని చేస్తున్న ఉపాధ్యాయు లను భయపెట్టి పనిచేయించలేరని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు బి.మహదేవప్ప హెచ్చరించారు. ఆది వారం స్థానిక ఎస్టీయు భవన్‌లో ఆదోని, కౌతాళం మండలాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కౌతాళం మండలం ఎస్టీయూ అధ్యక్షుడు పి.అంజనయ్య అధ్యక్షత వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి బి.మహదేవప్ప మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళిక అని, ప్రాథమిక విద్యార్థులకు జీఎఫ్ఎల్ఏ అనే పేరుతో పాఠశాలల్లో చేస్తున్న విద్యా బోధనలో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను బాధ్యులుగా చేయడం ద్వారా ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయునికి స్వేచ్ఛపూరితమైన వాతావరణం నెల్లకొన్నప్పుడే ఉపాధ్యాయుడు చక్కటి విద్యా బోధన అందించగలుగుతాడన్నారు. ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు హాజరు వేసినట్లయితే ఉపాధ్యాయులను సర్వీస్ నుంచి రిమూవ్ చేయడం జరుగుతుందని విద్యాధికారులు తెలియచేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ సూర్యుడు, ఆదోని మండల అధ్యక్షులు లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి చింతకుంట రామకృష్ణ, ఆర్థిక కార్యదర్శి పి.షేక్షావలి సీనియర్ నాయకులు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నూతన హెల్త్ సెంటర్ భవనం పనులను ప్రారంభం

విశాలాంధ్ర -గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్.కైరవాడి గ్రామంలో నూతన హెల్త్ సెంటర్ పనులను టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్.కైరవాడి సొసైటి అధ్యక్షులు బి.తిమ్మారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పీఏసీ సభ్యులు, ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో రూ.30 లక్షలతో మంజూరు అయినా నూతన హెల్త్ సెంటర్ భవనం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల సెక్రటరీ రాజేష్ నాయుడు, అబూ బాక్కర్, పెద్దయ్య, నైమురాజు, ఐటీడీపీ సోషల్ మీడియామండల అధ్యక్షులు రాంపురం రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ మార్కెట్ నిర్వీర్యం, మంత్రి లోకేష్ శిలాఫలకం ఎక్కడ..

విశాలాంధ్ర - నందవరం: నందవ రంలో ఉన్న విలేజ్ మార్కెట్ నిర్వీర్యమైం దని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవ రావ్ దేశాయ్ తెలి పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం 2018లో అప్పటి మంత్రి నారా లోకేష్ విలేజ్ మార్కెట్ ప్రారంభం కోసం శిలాఫలకము నిర్మించామని, ప్రస్తుతం అది కనుమరుగైపోయే పరిస్థితి నెలకొందన్నారు. శిలాఫలకం ముందు వ్యాపార నిమిత్తం ఆదివారం బంకును వేయడం జరిగిందని, దీంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శిలాఫలకం కనిపించకుండా బంకును అడ్డంగా ఉంచార న్నారు. గ్రామంలో అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు వ్యాపా రులను ప్రోత్సహించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. శిలాఫలకం ముందు ఏర్పాటు చేసిన బంకును తొలగించాలని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విలేజ్ మార్కెట్ లేనందున వ్యాపారం చేసే మహిళలు, కూరగాయలు కొనే మహిళలు ఇబ్బందులు పడుతున్నామని తమ దృష్టికి తెచ్చారన్నారు. వ్యాపారులు కూరగాయలను రోడ్లపైనే అమ్మకాలు చేస్తున్నారని, దీంతో ట్రాఫిక్ అంతరాయం, దుమ్ము, ధూళి చేరిన కూరగాయలు కొని తినడం వలన ప్రజలు అనారోగ్యాలు పాలవుతున్నారన్నారు. పంచాయతీ కార్యాలయం ముందే ఇలా జరిగిన గ్రామ పాలకులు, పంచాయతీ, మండల అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. అధికారులు స్పందించి శిలాఫలకం ముందు బంకును తొలగించి, విలేజ్ నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరారు.

ఎరువుల దుకాణంలో జేడీఏ తనిఖీ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కల్లూరు మండలము లోని ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మీ ఆది వారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కల్లూరు మండలములోని సాయి కృప ఏజెన్సీస్, విజయ లక్ష్మీ ఏజెన్సీస్ ఎరువుల దుకా ణములలో తనిఖీలు నిర్వహించి, యూరియా స్టాక్ వివరాలు, స్టాక్ రిజిస్టర్లు, ఈ పాస్ స్టాక్ గ్రౌండ్ బ్యాలన్స్‌లను పరిశీలించి రూ.2.93 లక్షలకు స్టాప్ సేల్ ఇచ్చారు. కర్నూలు మండలము లోని మన గ్రోమోర్ సెంటర్ నందు తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించి యూరియా వివరాలను ఫ్లెక్సీలను పరిశీలించారు. ఇందులో భాగంగా కర్నూలు వ్యవసాయ సహాయ సంచాలకులు సాలు రెడ్డి, కల్లూరు మండల వ్యవసాయ అధికారి విష్ణు వర్ధన్ రెడ్డిలు పాల్గొన్నారు.

31వ తేదీన పింఛన్‌ల పంపిణీ చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు : ఈ నెల 31న పింఛనుదారుల ఇంటివద్దకే వెళ్ళి పెన్షన్లను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, పింఛన్‌ల పంపిణీ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జనవరి ఒకటవ తేదీన పంపిణీ చేయవలసిన పింఛన్లను 31వ పింఛన్‌దారులకు పంపిణీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌లో భాగంగా ఐవిఆర్ఎస్ ద్వారా పెన్షన్ పంపిణీపై పింఛన్ దారుల నుండి అభిప్రాయ సేకరణ జరుగుతోందని, ఈ సందర్భంగా పింఛన్‌దారుల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని కలెక్టర్ పింఛన్‌ల పంపిణీ అధికారులను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణా రెడ్డి, జడ్పీ సీఈవో నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల శ్రేయస్సుకై పోరాడే ఏకైక జెండా ఎర్ర జెండా

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : పేద, బడుగు బలహీన వర్గాల అట్టడుగు వర్గాల అభ్యున్నతకై పోరాడేది ఏకైక జెండా ఎర్రజెండా అనీ ఎస్టీయూ రాష్ట్ర మాజీ కార్యదర్శి, సీనియర్ నాయకులు నాగరాజు, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న తెలిపారు. అనంతరం సీపీఐ వందేళ్ళ శతాబ్ది వసంతాల సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో గాంధీనగర్‌లో ఉన్న జెండా కట్టకు పార్టీ జెండానును ఎస్టీయూ మాజీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకులు నాగరాజు మరియు శివన్న నగర్‌లో సీపీఐ జెండాను శాఖ కార్యదర్శి ఎల్లప్ప ఎగరవేశారు. అనంతరం ఎస్టీయూ సీనియర్ నాయకులు నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అడివన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నేపథ్యం పోరాటాలతో కూడుకున్నది, నిత్యం కార్మికులకు,కర్షకులకు, రైతులకు, దళితులకు, నిరుద్యోగులకు ఆదివాసుల, ఉద్యోగస్తుల సమస్యల సాధనకై సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న పార్టీలు కమ్యూనిజం అని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు బసవరాజు, ప్రసన్న రాజు,వెంకటేశ్వర్లు, విజయేంద్ర, ఎర్రిస్వామి, బాబయ్య, ఎల్లప్ప, వెంకటేశ్వర్లు, తులసీరామ్, చంద్రశేఖర్, రాజశేఖర్, వెంకట్, రాముడు, షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేది సీపీఐనే

విశాలాంధ్ర - నందవరం: నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.పంపన్న గౌడ్ అన్నారు. ఆదివారం నాగలదిన్నెలో సీపీఐ శతజయంతి ఉత్సవ వేడుకలను శాఖ కార్యదర్శి అబ్దుల్ గఫూర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పంపన గౌడ్ మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం పెత్తందారి వ్యవస్థ నిర్మూలన కోసం పోరాటాలు నడిపింది సీపీఐ అని, సంపూర్ణ స్వాతంత్రం కోసం బ్రిటిష్లకు వ్యతిరేకంగా త్యాగాలు చేసిన పార్టీ అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, రాజ్యాంగాన్ని దెబ్బతీసే విధంగా రాక్షస పాలన కొనసాగిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన ప్రజలందరినీ ఏకం చేసి భవిష్యత్తు పోరాటాల ద్వారా రాజ్యాంగ హక్కులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు సోమేశ్వర్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, జబ్బర్, భీమన్న, నాగేష్, ఈరన్న, సోయాల్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

మిరప రైతును ప్రభుత్వం ఆదుకోవాలి

- మిరపకు గిట్టుబాటు ధర ఉన్నప్పుడు మిరపపంట తెగుళ్ళతో నాశనం
- ఆకుముడత గజ్జి తెగుళ్ళ నుంచి మిరప పంటను ఆదుకోవాలి
- మిరప రైతులను పంటభీమా మంజూరు చేయాలి

విశాలాంధ్ర -గోనెగండ్ల: మండల కేంద్రానికి చెందిన కుర్వ దుబ్బ రాముడు పదెకరాల పోలం కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసుకొని జీవనం కోనసాగిస్తున్నారు. కుర్వ దుబ్బ రాముడు మిరప పంటను ఐదెకరాల్లో సాగుచేశారు. ఈ మిరప పంటకు ఆకుమడత గజ్జి తెగుళ్ళు, మిరపకాయలు తెల్ల మచ్చలు పంట నాశనం అవుతుంది. దాదాపు మిరప పంటకు 5ఎకరాలు గాను పెట్టుబడి 6లక్షలు ఖర్చు పెట్టాను అని కుర్వ దుబ్బ రాముడు తెలిపారు.అలాగే గత 3సంవత్సరాలు నుంచి మిరప పంట చేతికి రాకుండా వైరస్ తో నష్టపోవడం లేదా పంట వచ్చినప్పుడు గిట్టుబాటు ధర లేక పోవడంతో దాదాపు నాలుగేళ్ల మిరప పంట చేతికి రావడం లేదు. ఈసారి మిర్చి రేటు ఆశాజనకంగా ఉంది. పంట మాటకు అంత అంతా మాత్రమే ఉంది. ఎండు మిర్చికి క్వింటానికి రూజ15 వేల నుంచి రూ.17వేల వరకు ధర మిరపకాయలు పలుకుతుంది. దాదాపు మండలంలో 2వేల ఎకరాలు మిరప పంట సాగుచేశారు. దాదాపు ఎకరాకు మిరప పంట 20 నుంచి 30 క్వింటాళు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చేబుతున్నారు. గత ఏడాది ఎండు మిర్చి క్వింటాంకు 10 వేల నుంచి 12 వరకు మాత్రమే ఉంటుంది. ఈసారి ఎండు మిర్చిలకు కర్నూలు మార్కెట్‌లో 10 నుంచి 12 వరకు ధర పలుకుతుంది. అర్మూర్ మిరపకు కర్నూలు మార్కెట్‌లో రూ.17777 ఉంది. 341 మిర్చికి రూ.14699, తేజ మిర్చికి రూ.15313, తాలు మిర్చికి రూ.13909, దేవనూర్ బీఎస్‌కి 14509, సూపర్ -10మిర్చికి రూ.8600 మార్కెట్‌లో లభిస్తుంది. మిరప రైతులు మాత్రం గజ్జి తెగుళ్ళతో, ఆకుముడత మచ్చ తెగుళ్ళు, మిరపకాయపైన మచ్చలు వచ్చి పంట నాశనం అవుతుంది. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి మిరపపంటకు భీమా సౌకర్యం కల్పించగలరని కోరుతున్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 29, డిసెంబరు 2025

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ 141వ దినోత్సవం వేడుకలు నియోజకవర్గ సమితిలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణ నడిబడున సప్తగిరి లాడ్జి ముందు కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మునిసిపల్ మాజీ కౌన్సిలర్ దిలీప్ దోక మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం చట్టంలో మహాత్మా గాంధీ పేరు తొలగించడం చాలా అన్యాయమని, దుర్మార్గమైన పని అని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటిష్ దొరల చెర నుండి విముక్తి పొందడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశం కోసం దేశ ప్రజల కోసం ప్రాణ త్యాగం చేసి స్వాతంత్రమును సంపాదించుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు అని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు గౌరవ రాహుల్ గాంధీ రాబోయే ఎన్నికల్లో ప్రధానమంత్రిగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతి వార్డులో తిరిగి పార్టీ వైభవానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కోరారు.కార్యక్రమంలో ఆదోని పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.మారుతీ రావు,ఆదోని యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, భారత జాతీయ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనిత్, రామకృష్ణ రెడ్డి,రఫిక్ అహ్మద్, నిసార్ అహ్మద్, మాణిక్యరాజు, రామన్న యాదవ్, తాయన్న, తాయన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మత్తులు

విశాలాంధ్ర -గోనెగండ్ల: కోడుమూరు నుంచి ఎమ్మిగనూరు వరకు ప్రధాన రహదారి గుంతలమయమైంది. ఈ ప్రధాన రహదారిపై వాహనాదారులు, గుంతలమయమైన రోడ్డు పైన ప్రయాణం సాగిస్తున్నారు. ఈ గుంతల రోడ్డు ఊయల జఫ్ఫాల మాదిరిగా రహదారి ఉండటంతో స్థానిక ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి స్పందించి గుంతలు పూడ్చటకు, ప్యాచిలు వేముటకు నిధులు మంజూరు చేయడంతో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి సాకారంతో ఆర్ ఎన్ బీ అధికారులు గుంతలు పడినచోట ప్యాచిలు వేస్తున్నారు. మండల ప్రజలు ఈ డబ్బుల్ రోడ్డు నుంచి ఫోర్ లైన్ రోడ్డు ఎప్పుడు వస్తుందని ప్రజలు వేచి చూస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి కోడుమూరు నుంచి ఎమ్మిగనూరు వరకు ఫోర్ లైన్ రోడ్డు మంజూరు చేయాలని ప్రజలు కోరారు.

ఆలూరులో..

జనసేనా గల్లంతేనా

విదేశాల్లో ఇంచార్జి.. | **వీకెండ్ రాజకీయాలపై విమర్శలు** | **కూటమిలో దక్కని ప్రాధాన్యత**

విశాలాంధ్ర - ఆస్పరి: రాష్ట్ర రాజకీయాల్లో కీలక శక్తిగా కింగ్ మేకర్‌గా ఎదిగిన జనసేన పార్టీ, ఆలూరు నియోజక వర్గంలో మాత్రం ఉనికి కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా, నియోజక వర్గంలో పార్టీని నడిపించే నాథుడే లేకపోవడంతో జనసైని కులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నియోజకవర్గ ఇంచార్జీ తేర్నెకల్లు వెంకప్ప విదేశాల్లో ఉద్యోగం చేస్తూ, అప్పుడప్పుడు వచ్చి వెళ్లే 'వీకెండ్ పాలిటిక్స్' చేయడం వల్లే పార్టీ ఈ దుస్థితికి చేరుకుందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

విదేశీ ఇంచార్జీ - స్థానిక నిర్వీర్యం: ప్రజా సమస్యలపై పోరాడాల్సిన నాయకత్వం క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడం పార్టీకి శాపంగా మారింది. ఇంచార్జీ వెంకప్ప అందుబాటులోలేని కారణంగా నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు స్తంభించిపోయాయి. ప్రస్తుతం ఆయన క్రిస్మస్ సెలవుల కోసం వచ్చి ఆస్పరి మండల పర్యటనలు చేస్తున్నప్పటికీ, అది కేవలం నామమాత్రమేనని, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపలేకపోతున్నారని కార్యకర్తలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

పవన్ కళ్యాణ్ అభిమానుల ఆగ్రహం: నియోజకవర్గంలో జనసేన పార్టీని ముందుండి నడిపించే నాయకుడే లేడా అంటూ పవన్ కళ్యాణ్ అభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన జనసేన, ఇక్కడ మాత్రం కాగితాలకే పరిమితమైందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో నామినేటెడ్ పోస్టుల భర్తీలో జనసేనకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రశ్నించాల్సిన ఇంచార్జి అందుబాటులో లేకపోవడమే ప్రధాన కారణమని జనసైనికులు ఆరోపిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం, ఆలూరులో మాత్రం టీడీపీ ఆధిపత్యమే: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ల కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, ఆలూరు నియోజకవర్గంలో మాత్రం పూర్తిగా టీడీపీ ఆధిపత్యమే కొనసాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. గత 30 ఏళ్లుగా టీడీపీ జెండా ఎగరని ఆలూరులో ప్రస్తుతం టీడీపీ ఇంచార్జీగా వైకుంఠం జ్యోతి కొనసాగుతుండగా, బీజేపీకి గుమ్మనూరు నారాయణ సతీమణి కమలమ్మ నాయకత్వంలో స్థానిక ఎన్నికల్లో జనంలోకి వెళ్లి పట్టు నిలుపుకునేందుకు సంయుక్తమౌతుంది. జనసేన ఉనికి మాత్రం నియోజకవర్గంలో ఎక్కడ కనిపించడంలేదన్న ఆరోపణలు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి.

స్థానిక ఎన్నికల వేళ 'మౌనం' ఎవరి కోసం : జనవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో, జనసేన అభ్యర్థుల ఎంపికలో, వ్యూహరచనలలోను ఎలాంటి చురుకుదనం కనిపించడం లేదు. మండల కన్వీనర్లు కూడా సొంత పార్టీ బలోపేతం కంటే, టీడీపీ నేతల కనుసన్నల్లోనే మెలుగుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంచార్జి అందుబాటులో లేని తరుణంలో మండల స్థాయి నేతలు ఎవరికి వారు యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

డిప్యూటీ సీఎంగా పవన్ ఆలూరుపై దృష్టి ఎప్పుడు : కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న పవన్ కళ్యాణ్ ఆలూరు నియోజకవర్గంపై ఎప్పుడు దృష్టి సారిస్తారు? స్థానికంగా అందుబాటులో ఉండే పూర్తి స్థాయి నాయకత్వాన్ని ఏర్పాటు చేస్తారా? లేక ఆలూరును రాజకీయంగా పక్కన పెడతారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పటికైనా జనసేన అధిష్ఠానం స్పందించి ఆలూరు నియోజకవర్గంలో ప్రజల మధ్య ఉండే, పోరాటశీల నాయకత్వాన్ని ఏర్పాటు చేయకపోతే, ఈ నియోజకవర్గంలో జనసేన పార్టీ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలో బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వ ర్యంలో శాంతిరాం ఐ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఆదివారం స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేంద్రియాలలో కన్నే అత్యంత ప్రధానమైనదని, కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమవుతుందన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయుక్తమని తెలిపారు. శాంతిరాం ఐ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్లు వెంకట్రాముడు, అబ్దుల్లా, షాషావలి వైద్య సేవలు అందించగా, శిబిరానికి సుమారు వందమందికి పైగా ప్రజలు హాజరయ్యారు. ఈరోజు ఆపరేషన్‌కు ఎంపికైన వారిని అదే రోజున బస్సులో కర్నూలుకు తీసుకెళ్లి శస్త్రచికిత్స చేయించి తిరిగి గ్రామానికి చేర్చే ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు వివరించారు. బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి కార్యదర్శి విరుపాక్షి అధ్యక్షత వహించారు. గ్రామ సర్పంచ్ వీరభద్ర, ఉప సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ లక్ష్మన్న, గ్రామ పెద్దలు వీరేష్, నరసింహులు, సేవా సమితి సభ్యులు రమేష్, వీరేష్, శేఖర్, సురేష్, అనిల్, సూరి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - చిప్పగిరి: రైతుల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోందని బెల్డోన సహకార పరపతి సంఘం అధ్య క్షులు కొండా రామాంజనేయులు తెలిపారు. ఆదివారం పాత్రికేయుల సమావేశంలో బెల్డోన సొసైటీ చైర్మన్ కొండా రామాంజనేయులు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే లక్ష్యంగా బెల్డోన సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు దీర్ఘకాలిక రుణాల కింద రూ.1 కోటి మంజూరు కాగా, మండల కేంద్రమైన చిప్పగిరి, దౌల్తాపురం, నంచర్ల, కుందన గుర్తి, గుమ్మనూరు గ్రామాల రైతులకు రుణాలు అందజేయడం జరిగిందన్నారు. ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జీ వైకుంఠం జ్యోతి సహకారంతో మండల రైతులను దృష్టిలో ఉంచుకొని మరో రూ.3 కోట్లు దాకా దీర్ఘకాలిక రుణాలు కింద ప్రతిపాదనలు పంపడం జరిగింద న్నారు. సొసైటీ ద్వారా రైతులు తీసుకున్న వివిధ రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధి కొరకు ప్రతి ఒక్క రైతు కృషి చేయాలన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినప్పుడే మరి కొంత మంది రైతులకు రుణాలు అందుతాయన్నారు.

పేదలకు అండ ఎర్ర జెండా

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: నగర సమితి పరిధిలోని కొత్త భూపోరాట స్థలానికి ఆదివారం చంద్ర రాజేశ్వరరావు కాలనీగా పేరును పెట్టడం జరిగింది. అది ఆదివారం సీపీఐ సీనియర్ నాయకులు కె.జగన్నాథం పేరును పెట్టి నేమ్ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శి సి.మహేష్, నాగరాజులు పాల్గొన్నారు. అనంతరం సీపీఐ 101వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని చంద్ర రాజేశ్వరరావు కాలనీలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షత వహించారు. సీపీఐ సీనియర్ నాయకులు కె.జగన్నాథం, నగర కార్యదర్శి రామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ దేశంలో పేద బడుగు బలహీన వర్గాలకు అన్ని రకాల సకల సౌకర్యాలు అందే వరకు ఎర్ర జెండా రాష్ట్రంలో ఉన్న పేదల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్లకు ఊడిగం చేసే దాంట్లో భాగంగా ఈ దేశాన్ని ఆదాయాన్ని అంబానీలకు తాకట్టు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు అన్వర్, ఈశ్వర్, నల్లన్న, విద్యార్థి సంఘం నాయకులు సోమన్న, అశోక్, కాలనీ ఇంచార్జీ ప్రసాద్, అశోక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగర బలిజ సంఘం కోశాధికారి ఎన్నిక

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: కర్నూలు నగర బలిజ సంఘం ఆదివారం హెచ్‌డీ సిటీ కాంప్లెక్స్ కార్యాలయం లో నగర బలిజ సం ఘం కార్యవర్గ సమా వేశం నగర అధ్యక్షులు గాండ్ల లక్ష్మన్న జరిగింది. ఈ సమావేశంలో నగర బలిజ సంఘం కార్యవర్గంలో మార్పులు, చేర్పులు గురించి నగర బలిజ సంఘం ప్రధాన కార్యదర్శి మండలం రవికుమార్ చర్చించారు. ఇందులో భాగంగా నూతన కోశాధికారిగా రిటైర్డ్ ఎస్సై ప్రకాష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు నాడు అధ్యక్షులు అర్జా రామకృష్ణ, కార్పొరేటర్ సోమిరెడ్డి, అడ్వకేట్ శ్రీనివాస్, పోతా సహదేవుడు, రామి రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శివరాముడు, అనిమిరెడ్డి, వీరేశ్ బాబు, మధు, సుజాత, బ్రాహ్మణి, సరస్వతి పాల్గొన్నారు.

విజయవంతంగా 63వ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదల కోసమే కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి అన్నారు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో నిర్వహించిన 63వ మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. కోవెలకుంట్ల తాలూకా సంజామల మండలం మంగపల్లె గ్రామంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత డాక్టర్ పి. దస్తగిరిరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకే పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, తన తల్లిదండ్రుల నుండి తనకు వచ్చిన 10 ఎకరాల పొలాన్ని పేదల కోసమే కేటాయించి నట్లు చెప్పారు. తన పదేకరాల పొలంలో పెద్దిరెడ్డి ట్రస్ట్ తరపున ప్రజా వైద్యశాలను నిర్మించి అక్కడ పేదలకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తమ సొంత ఖర్చులతో ఉచితంగా భోజన వసతిని కల్పిస్తూ మంగపల్లె గ్రామంలోని ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నామన్నారు. 56వ మెగా వైద్య శిబిరంలో వెయ్యి మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డైరెక్టర్ షేక్షావలిరెడ్డి వెల్లడించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె జబ్బులు, బీపీ, షుగరు, మోకాళ్ళ నొప్పులు, కంటివ్యాదులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీలకు సంబందించిన వ్యాదులు, చెవి, ముక్కు, గొంతుకు సంబందించిన జబ్బులకు, దంతవ్యాదులు, చర్మవ్యాదులకు వైద్యసేవలు చేసి మందులను ఇస్తున్నామన్నారు.

ఒకేషనల్ కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: అప్రెంషిప్ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్న వోకేషనల్ కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్ భాష డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదోని పట్టణంలో ఉన్నటువంటి ప్రైవేట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలల యజమాన్యం అప్రెంషిప్ పేరుతో విద్యార్థుల నుండి రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారన్నరని ఆరోపణలు చేశారు. ప్రభుత్వం నుంచి అప్రెంషిప్‌కు ఎలాంటి రుసుములు వసూలు చేయకూడదని నియమ నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కుతూ వోకేషనల్ చదువుతున్న విద్యార్థుల దగ్గర నుండి వేల రూపాయలు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. చాలామంది పేద విద్యార్థులు తాము కట్టలేము సార్ అంటే మీరు అప్రెంషిప్ ఫీజు కట్టితేనే మీకు పరీక్షలు రాయడానికి అనుమతి ఇస్తాము, లేకపోతే మీకు హాల్ టికెట్ ఇవ్వము అని విద్యార్థులకు భయప్రాంతాల గురి చేస్తున్నారన్నారు ప్రభుత్వ నియా నిబంధనలు ఉల్లం ఘించి విద్యార్థుల నుండి అప్రెంటిషిప్ పేరుతో వేల రూపా యలు వసూలు చేస్తున్న ప్రవేట్ ఒకేష నల్ జూనియర్ కళాశాలల యజమా న్యంపై చర్యలు తీసుకొని విద్యార్థుల నుండి వసూలు చేసిన వేల రూపాయలు తిరిగి విద్యార్థులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి యు.దస్తగిరి, పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్, సహాయ కార్యదర్శి మోహన్, ఉపాధ్యక్షుడు వీరేష్, అంజి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం మా వైపు ఉంది, దౌర్జన్యం చేసే స్థితిలో లేము

విశాలాంధ్ర - నందవరం : న్యాయం తమ వైపు ఉందని, దౌర్జన్యం చేసే సంస్కృతి తమ దగ్గర లేదని జంబూ పెద్ద మల్లన్న గౌడ్, జంబూ చిన్న మల్లన్న గౌడ్‌లు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఎమ్మిగనూరు డీఎస్పీకి కారుమంచి బసవరాజు స్థలం తమది అంటూ ఫిర్యాదు చేయడంతో కొన్ని దినపత్రికల్లో వార్త రావడం జరిగిందన్నారు. ఆ స్థలం 1952లో జంబు బసవన్న గౌడ్ నుండి తమ తాతగారు కొనడం జరిగిందని, తమ ఇంటి ముందు వాహనాలను ఆపుకోవడానికి వదిలిన స్థలాన్ని తమది అని అంటున్నాడని, వాస్తవంగా నీటి బోరు, తాగునీటి కుళాయి, 4ఏళ్ల క్రితం వేసినా టెంకాయ చెట్టు ఉన్నాయన్నారు. బసవ రాజుది స్థలమైతే ఇవన్నీ ఏర్పాటు చేసుకున్నప్పుడు ఎక్కడ ఉన్నాడని, దానికి సంబంధించి ఒక వైపు కాంపౌండ్ కూడా కట్టడం జరిగిందన్నారు. ఊర్లోనే ఉండి వేరేచోటి ఇల్లు కట్టించుకున్న వ్యక్తి, ఇప్పుడు స్థలం తనది అని చెప్పడం చాలా విడ్డురంగా ఉందన్నారు. నందవరం గ్రామంలో జంబు ఫ్యామిలీ ఎక్కడ దౌర్జన్యాలు చేసినట్లు దాఖలాలు లేవని, బసవ రాజే దౌర్జన్యంగా మా ఇంటి ముందు అడ్డంగా బండలు పాతెందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని నగరూరు గ్రామ బస్టాండ్ సమీపంలోని కల్వర్టు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నాగేశ్వరరావు, కూలీలు లక్ష్మీనరసింహ, మద్దిలేటిలు నాపరాల లోడుతో ట్రాక్టర్‌లో ఆదోనికి వెళ్తున్నారు. అదే సమయంలో మంత్రాలయానికి వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు నగరూరు బస్టాండ్ సమీపంలో ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న మద్దిలేటి (32) అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ నాగేశ్వరరావుకు తీవ్ర రక్తస్రావ గాయాలు కావడంతో 108 అంబులెన్స్ ద్వారా ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉపాధ్యాయులను భయపెట్టి పని చేయించ లేరు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: బాధ్యతతో పని చేస్తున్న ఉపాధ్యాయు లను భయపెట్టి పనిచేయించలేరని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు బి.మహదేవప్ప హెచ్చరించారు. ఆది వారం స్థానిక ఎస్టీయు భవన్‌లో ఆదోని, కౌతాళం మండలాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కౌతాళం మండలం ఎస్టీయూ అధ్యక్షుడు పి.అంజనయ్య అధ్యక్షత వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి బి.మహదేవప్ప మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళిక అని, ప్రాథమిక విద్యార్థులకు జీఎఫ్ఎల్ఏ అనే పేరుతో పాఠశాలల్లో చేస్తున్న విద్యా బోధనలో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను బాధ్యులుగా చేయడం ద్వారా ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయునికి స్వేచ్ఛపూరితమైన వాతావరణం నెల్లకొన్నప్పుడే ఉపాధ్యాయుడు చక్కటి విద్యా బోధన అందించగలుగుతాడన్నారు. ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు హాజరు వేసినట్లయితే ఉపాధ్యాయులను సర్వీస్ నుంచి రిమూవ్ చేయడం జరుగుతుందని విద్యాధికారులు తెలియచేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ సూర్యుడు, ఆదోని మండల అధ్యక్షులు లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి చింతకుంట రామకృష్ణ, ఆర్థిక కార్యదర్శి పి.షేక్షావలి సీనియర్ నాయకులు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నూతన హెల్త్ సెంటర్ భవనం పనులనుప్రారంభం

విశాలాంధ్ర -గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్.కైరవాడి గ్రామంలో నూతన హెల్త్ సెంటర్ పనులను టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్.కైరవాడి సొసైటి అధ్యక్షులు బి.తిమ్మరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పీఏసీ సభ్యులు, ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో రూ.30 లక్షలతో మంజూరు అయినా నూతన హెల్త్ సెంటర్ భవనం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల సెక్రటరీ రాజేష్ నాయుడు, అబూబాక్కర్, పెద్దయ్య, నైమురాజు, ఐటీడీపీ సోషల్ మీడియామండల అధ్యక్షులు రాంపురం రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

విశాలాంధ్ర -గూడూరు: గూడూరు పట్టణం శివారులోని కర్నూలు రహదారి లచ్చమ్మ గుడి సమీపంలో గుర్తు తెలియని శవం లభ్యం అయింది. స్థానిక రైతులు ఆదివారం మృత దేహాన్ని గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి ఎస్సై రాజు కుల్లాయప్ప చేరుకొని మృతికి గల కారణాలు పరిశీలించారు. వారం రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు హత మార్చి రోడ్డు పక్కన పడేసినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడికి కాషాయం కలర్ డ్రాయర్ తెల్లని బనిగిన ఉందని, ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు గూడూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎంపీని కలిసిన సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ లోకరాజు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ లోకరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఆఫీసర్ లోకరాజు ఉద్యోగుల సమస్యలు, పరిపాలనా పరమైన సమస్యల ను ఎంపీ నాగరాజు దృష్టికి తీసుకురాగా. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కారం

విశాలాంధ్ర - పెద్ద కడబూరు: మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలోని ఎస్సీ కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీ వాసుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం గ్రామంలోని శ్రీ కృష్ణ ఆశ్రమం వద్ద ఉన్న హెచ్ ఆర్ ట్యాంక్ నుంచి ఎస్సీ కాలనీ మీదుగా శ్రీరామ్ నగర్‌కు 15వ ఆర్థిక సంఘం నిధులతో కొత్త పైపు లైను వేశామన్నారు. తాగునీటి సరఫరా కోసం ఎస్సీ కాలనీలో 5, శ్రీరామ్ నగర్ లో 10 చోట్ల కొళాయిలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడిని కలిసిన మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి



విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్ రెడ్డి స్వగృహంలో కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు చదివిరాళ్ల భూపేసిరెడ్డిని మాలసంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవాలని వారు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా కార్యదర్శి కె.శివుడు, మేకల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.